సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 4 । ఆగస్టు । 2024




# నీ స్నేహం..

దోస్తులంటే కేసీఆర్‌కు ప్రాణం
నడక కలిపిన స్నేహ బంధం
ఆడపిల్లల పెళ్లిళ్లకు చేయూత

కష్టాలలో కన్నీరు తుడిచేవాడు...
ఆపదలో అండగా ఉండేవాడు...
ఆనందంలో ఆత్మబంధువుగా ఉండేవాడు..
దుఃఖంలో ధైర్యాన్ని ఇచ్చేవాడు...
బాధలో బంధువుగా తోడు ఉండేవాడు...
సుఖంలో సంబరాన్ని తెచ్చేవాడు...
స్నేహితుడి సుఖం కోరుకునే వాడు
స్నేహితుడు..

సండే స్పెషల్



ఆపన్న హస్తం అందిస్తూ..

8లో..

## న్యూస్‌రీల్

### 15 రోజుల్లోగా పెండింగ్ దరఖాస్తులు పూర్తి

● కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

సాక్షి సిద్దిపేట: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వచ్చే 15 రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. శనివారం ధరణి పెండింగ్ దరఖాస్తులపై సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

### ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

సిద్దిపేటరూరల్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, రెగ్యులర్ పట్టాల పంపిణీ అంశాలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ, వెరిఫికేషన్ వంటి అంశాలపై సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీపీఓ దేవకీదేవి తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

● జిల్లా న్యాయమూర్తి సాయిరమాదేవి



దుబ్బాకలో కోర్టు భవనం నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న న్యాయమూర్తి సాయి రమాదేవి

దుబ్బాక: దుబ్బాకలో కోర్టు భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా న్యాయమూర్తి సాయి రమాదేవి ఆదేశించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో దుబ్బాక కోర్టు జడ్జి తరణితో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త కోర్టు భవనాన్ని సకల సౌకర్యాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. కోర్టులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ వెంకటేశ్, కోర్టు సూపరింటెండెంట్ సుధాకర్, దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురావు, న్యాయవాదులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, శ్రీరాం రామకృష్ణ ప్రభు, సంతోష్, భూపతి, చంద్రం తదితరులు ఉన్నారు.

### విద్యుత్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

● డీఈ మహేశ్




విద్యుత్ సమస్యల గురించి ఆరా తీస్తున్న డీఈ మహేశ్

సిద్దిపేటజోన్: విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డీఈ మహేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక 42 వార్డులో విద్యుత్ సరఫరా మెరుగు కోసం అదనంగా 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓవర్ లోడ్ సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కౌన్సిలర్ శోభారాణి వార్డులో విద్యుత్ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టిన అధికారులకు అభినందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏ సుధాకర్, ఏఈ రమేశ్ పాల్గొన్నారు.

### రామవరం యువకుడి తీన్మార్



నాగరాజురెడ్డి,



తేజస్వినిరెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన ఎడమాల నాగరాజురెడ్డి ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించాడు. నిన్న వెలువడిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈ) తుది ఫలితాల్లో మెరుగైన ర్యాంకును సంపాదించుకున్నాడు. పాలిటెక్నిక్ లెక్చరర్, గ్రూప్–4 ఉద్యోగాల్లో కూడా మెరుగైన ర్యాంకు పొందాడు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన ఎడమాల తేజస్విని రెడ్డి కూడా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈ) ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో నాగరాజురెడ్డి మూడు ఉద్యోగాలు, తేజస్వినిరెడ్డి ఏఈ ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు అభినందించారు.

# రిజర్వాయర్లు నింపండి

● రైతన్నల కోసం రాజకీయాలు పక్కన పెట్టాలి
● మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మెల్యే హరీశ్ లేఖ



సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లాలోని కాళేశ్వరం అనుసంధాన రిజర్వాయర్లలో పూర్తిగా నీళ్ల లేక అడుగంటి పోతున్నాయని, వెంటనే మిడ్‌మానేరు ద్వారా నీటిని పంపింగ్ చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం బహిరంగ లేఖ రాశారు. జిల్లాలోని అంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్‌లో ప్రస్తుత నీటి నిల్వ పరిస్థితులు, వ్యవసాయ సాగుకోసం గోదావరి నీటి ఆవశ్యకత గురించి లేఖలో విపులంగా వివరించారు. గత ఏడాది ఆగస్టులో ఆయా రిజర్వాయర్లలో నీటి నిల్వ, ప్రస్తుతం ఆగస్టులో పరిస్థితి గణాంకాలతో పేర్కొన్నారు. ఒకవైపు రిజర్వాయర్లలో నీళ్ల లేక, మరొకవైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు సాగు చేయాలా వద్దా అనే అయోమయంలో రైతులు ఉన్నారని, గతేడాదితో పోల్చితే ప్రస్తుత సమయంలో జిల్లా పంటల సాగు తగ్గిందని పేర్కొన్నారు. రాజకీయాలు పక్కన బెట్టి మిడ్‌మానేరు నుంచి అంతగిరి (అన్నపూర్ణ), రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని, కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగం పక్షాన కోరుతునట్టు హరీశ్ తన లేఖలో పేర్కొన్నారు.

# ఇక స్వచ్ఛదనం.. పచ్చదనం

రాష్ట్ర ప్రభుత్వం ఈసారి స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఈనెల 5వ తేదీ నుంచి 9 వరకు పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కార్యాచరణ రూపొందించింది. ఇందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది.

– సాక్షి, సిద్దిపేట





మార్పడగ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

● రేపటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు
● 9వ తేదీ వరకు కొనసాగింపు
● 5.62 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 21.62 లక్షల మొక్కలు నాటాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. అందులో భాగంగా ఇప్పటివరకు 16 లక్షల మొక్కలు నాటారు. మిగిలిన 5.62 లక్షల మొక్కలను స్వచ్ఛదనం.. పచ్చదనం కింద నాటేలా లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో ఒక్కో ఇంటికీ ఆరు మొక్కలు (పండ్లు, పూల) అందించనున్నారు. ఇందుకోసం అటవీశాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది.

### రోజువారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు

■ మొదటి రోజు 5వ తేదీన 'స్వచ్ఛదనం.. పచ్చదనం'ప్రారంభం సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు చేపట్టనున్నారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలను సేకరించడం, వర్మి కంపోస్ట్ తయారు చేయడం, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి మంజూరు చేయనున్నారు.

■ రెండో రోజు 6న తాగునీటి ట్యాంకులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలి. మిషన్ భగీరథ ద్వారా వస్తున్న తాగునీటి పరీక్షలు నిర్వహించాలి. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. చెరువులు, కుంటలు కలుషితం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

■ మూడో రోజు పల్లె, పట్టణాల్లో మురికి కాలువల పూడిక తీయించాలి. వర్షం, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. లోతట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చాలి.

■ నాలుగో రోజు సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్యారోగ్య శాఖ అవగాహన కల్పించాలి. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.

■ ఐదోరోజు ఈనెల 9న ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలి.

### విజయవంతం చేయాలి

స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి. ఇంటింటికీ ఆరు మొక్కలను పంపిణీ చేస్తాం. ఇందుకు 5.62 లక్షలు సిద్ధంగా ఉంచాం. కార్యక్రమం విజయవంతం కోసం కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

– శ్రీనివాస్, డీఎఫ్‌ఓ

# ప్రతిభతో పాటు క్రమశిక్షణ ఉండాలి



డాక్టర్ గోపాలసుదర్శనంను సన్మానిస్తున్న విద్యార్థులు అధ్యాపకులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శనం

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్‌లో అన్ని గ్రూపులు మంచివేనని వాటిని చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపాల సుదర్శనం అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో టాలెంట్‌తో పాటు క్రమశిక్షణ, ఏదైనా సాధించాలనే తపన, మంచి హృదయం, నైతిక విలువలు ఉంటే జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉంటారన్నారు. హెచ్ఈసీ, సీఈసీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఎలాంటి ఉన్నత చదువులు చదవాలో, ఎలాంటి ఉద్యోగాలకు అర్హులో, ఎలాంటి వ్యాపారాలు చేసుకోవచ్చో వివరించారు. మంచి విలువతో కూడిన చదువుతో పాటు పట్టుదలతో కృషిచేసి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం సుదర్శనంను శాలువాతో సన్మానించారు. అధ్యాపకులు అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, జ్యోతి, షహాన పాల్గొన్నారు.

### నేర రహిత సమాజాన్ని స్థాపిద్దాం

మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి: నేర రహిత సమాజాన్ని స్థాపనే ధ్యేయంగా ప్రతీఒక్కరు పనిచేయాలని మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడానికి ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో పోలీసులు పని తీరు భేషుగ్గా ఉందని కితాబు ఇచ్చారు. డ్రగ్స్ నియంత్రణకు కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టాలని చెప్పారు. కార్మికులు నివాసం ఉండే పటాన్‌చెరు ఏరియాలో ప్రత్యేక గస్తీ నిర్వహించాలని సూచించారు. ఖేడ్ ప్రాంతంలో గాంజా సాగు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌హెచ్‌ఓలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతీ చిన్న కంప్లైట్‌ను స్వీకరించాలన్నారు. డ్రగ్స్ వివరాలు తెలిస్తే 8712656777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

# ధూధూ.. ఛీఛీ

● జాబ్ క్యాలెండర్‌పై బీఆర్‌ఎస్వీ వినూత్న నిరసన



జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను నిరసిస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో 'ధూధూ.. ఛీఛీ'అంటూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ నాయకులు మాట్లాడుతూ జాబ్‌లు లేకుండానే క్యాలెండర్‌ను ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల ఖాళీలు, తదితర వివరాలు పొందుపర్చలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ అనేది కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న కొత్త డ్రామాలా ఉందన్నారు. గత ప్రభుత్వం 503 పోస్టులతో గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేస్తే 60 పోస్టులు కలిపి రీ నోటిఫికేషన్ వేసినట్లు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించి, 32,410 మందిని ఎంపిక చేసిందని, ఎన్నికల కోడ్ వల్ల జాయినింగ్ లెటర్లు ఇవ్వడంలో జాప్యం జరిగిందన్నారు. అయితే.. ఈ ఉద్యోగాలు తామే ఇచ్చామని ప్రకటించుకోవడం హాస్యాస్పదమని చెప్పారు. గత ప్రభుత్వం క్లియరెన్స్ చేసిన 11,022 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఇప్పుడు కొనసాగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మహేశ్, యాదగిరి, భిక్షపతి నాయక్, మహిపాల్, రమేశ్, శ్రీకాంత్, అరవింద్, రాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

● ప్రజలతో మమేకం కావాలి : సీపీ అనురాధ
● త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిశీలన



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటిన సీపీ అనురాధ

సిద్దిపేటఅర్బన్: యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టి అరికట్టాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఆదేశించారు. శనివారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను, సీడీ ఫైల్స్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా సిబ్బందితో సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదికి దరఖాస్తుకు సంబంధించిన రశీదు ఇవ్వాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. అంకితభావంతో పనిచేయాలని, అదే సమయంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే పర్యావసనాల గురించి పాఠశాలల్లో, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని సూచించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ బుక్స్ తనిఖీ చేశారు. గ్రామాలలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని ఆదేశించారు.ఆగస్టు 15 తర్వాత మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఉత్తమంగా విధులు నిర్వహించే వారికి ప్రతి నెల రివార్డులు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రతి దరఖాస్తు దారునితో తప్పకుండా సంబంధిత పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడాలని సూచించారు. లేని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, పని చేయని వాటిని రిపేర్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్సైలు కొమురయ్య, చంద్రయ్య, ఐటీ సెల్ ఎస్సై నరేందర్, ఏఎస్సైలు శ్రీనివాస్, ముజీబ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులకు బదిలీ సహజం

తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పవని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం అన్నారు. ఇటీవల బదిలీ అయిన అధ్యాపకులను, సిబ్బందిని సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సాధారణమన్నారు. ఎక్కడకు వెళ్లినా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. అంకిత భావంతో పనిచేసిన వారిని విద్యార్థులు మర్చిపోరన్నారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్, దేవయ్య, అశోక్, వెంకటరమణ, రఘురాజ్, గంగాధర్, రాజ్యలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

# సూక్ష్మ సేద్యానికి మోక్షం

గజ్వేల్ : సూక్ష్మనీటి సేద్యపు పథకాన్ని నమ్ముకొని కూరగాయల తోటలు సాగుచేస్తున్న రైతులకు ఎట్టకేలకు స్వల్ప ఊరట లభించింది. ఎన్నోఏళ్ల నిరీక్షణ తర్వాత 1112.5ఎకరాల కూరగాయల తోటల్లో డ్రిప్‌ను విస్తరించడానికి రూ. 5.39కోట్లు మంజూరయ్యాయి. 19ఎకరాల్లో పండ్ల తోటల్లో డ్రిప్ పరికరాల కోసం రూ.40లక్షలు విడుదలయ్యాయి. 516యూనిట్ల తుంపర పరికరాలు ప్రత్యేకంగా మంజూరయ్యాయి. చాలాకాలం నిరీక్షణ తర్వాతనైనా బడ్జెట్ భారీగా వస్తుందని ఆశిస్తే అరకొరగా మంజూరుకావడం నిరాశను కలిగిస్తుంది. మరోవైపు ఆయిల్‌పామ్‌కు రూ.7.85కోట్లు మంజూరయ్యాయి.

కూరగాయలు, పండ్లు సాగు చేసే రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొన్నేళ్లుగా సూక్ష్మనీటి సేద్యపు పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై పరికరాలు అందజేస్తున్నారు. 5ఎకరాలలోపు భూమి ఉన్న సాధారణ రైతులకు 90శాతం, ఆపైన భూమి ఉన్న రైతులకు 80శాతం సబ్సిడీపై సూక్ష్మనీటి పథకం కింద బిందు(డ్రిప్పు), తుంపర(స్ప్రింకర్లు)పరికరాలు అందిస్తున్నారు. కానీ సరిపడా బడ్జెట్ కేటాయించకపోవడం వల్ల కొన్నేళ్లుగా దరఖాస్తులకు మోక్షం కలగడం లేదు. చాలాకాలం నిరీక్షణ తర్వాత తాజాగా ప్రభుత్వం జిల్లాలోని కూరగాయ తోటల్లో డ్రిప్పు పరికరాల కోసం రూ. 5.39కోట్ల నిధులను కేటాయించింది. ఈ నిధులతో 1112.5ఎకరాల్లో డ్రిప్ విస్తరించాలని కూడా టార్గెట్ నిర్దేశించారు.

జిల్లాలో కొన్నేళ్లుగా పథకానికి సంబంధించి సుమారు 4వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రస్తుతం విడుదలైన నిధులతో కేవలం వెయ్యికి మించి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించే అవకాశం లేకుండాపోయిందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. దీనివల్ల మిగతావారికి మళ్లీ నిరాశే మిగిలే పరిస్థితి కనిపిస్తుంది. ఇకపోతే స్ప్రింక్లర్ల కోసం రూ. 97లక్షలు మంజూరు చేసింది.



గజ్వేల్ ప్రాంతంలో డ్రిప్పు ద్వారా కూరగాయల సాగు

ఈ లెక్కన జిల్లాలో 516 యూనిట్లకు మాత్రమే పరికరాలు అందించే అవకాశం మాత్రమే కలిగింది. పండ్ల తోటలకు మరీ కంటితుడుపుగా కేవలం 19ఎకరాల్లో డ్రిప్ కోసం రూ.40లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. కాగా ఆయిల్‌పామ్‌కు ఎప్పటిలాగే పెద్దపీట వేస్తూ 4వేల ఎకరాల్లో విస్తరణకు రూ.7.85కోట్లు మంజూరయ్యాయి.

### కూరగాయలకు రూ.5.39కోట్లు

● పండ్ల తోటలకు రూ.40లక్షలు
● తుంపర యూనిట్లకు రూ.97లక్షలు
● ఆయిల్‌పామ్‌కు మరో రూ.7.85కోట్లు కేటాయింపు
● ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత కూరగాయల తోటలకు నిధులు
● బడ్జెట్ మరింతగా పెంచితేనే రైతులకు మేలు
● పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు

### ప్రభుత్వ చొరవపైనే ఆశలు

సాధారణ పంటల కంటే ఉద్యాన పంటలు పండ్లు, కూరగాయలు తదితరాలకు మరింత ప్రోత్సాహం పెంచడానికి ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉంది. ప్రత్యేకించి 'వెజిటబుల్ హబ్'గా ఆవిర్భవించిన సిద్దిపేట లాంటి జిల్లాలో కూరగాయలు, పండ్ల తోటల సాగుకు డ్రిప్, స్ప్రింక్లర్లకు బడ్జెట్‌ను పెంచాల్సి ఉంది. ఈ జిల్లాలో సాధారణ పంటలకు దీటుగా కూరగాయలు, పండ్ల తోటలు సాగవుతుండటం వల్ల పరికరాల కోసం ఏటా రైతులు వేలల్లో దరఖాస్తులు అందిస్తున్నా నిధులు రాకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఆయిల్‌పామ్ విస్తరణకు పెద్దపీట వేస్తూనే కూరగాయలు, పండ్ల తోటలకు బడ్జెట్ పెంచాలని రైతులు కోరుతున్నారు.

### దశలవారీగా దరఖాస్తుల పరిష్కారం

ప్రస్తుతం కూరగాయలు, పండ్ల తోటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల యూనిట్లకు నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో దశలవారీగా దరఖాస్తులను పరిష్కరిస్తాం. ప్రాధాన్యతక్రమాన్ని పరిశీలించి పరికరాలు అందిస్తాం.

– సువర్ణ, జిల్లా ఉద్యానవన అధికారి



ఆషాఢం వంటల కార్యక్రమంలో భాగంగా వాకర్స్ గ్రూపు కుటుంబాలు

# స్నేహితం..

అనుకోకుండా పరిచయమై జీవితాంతం తోడుంటుంది..

కష్టకాలంలో అండగా ఉండేవారే మిత్రులు

దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహబంధం

నేడు స్నేహితుల దినోత్సవం

మన కోసం మనం ఎంపిక చేసుకునే ఓ అద్భుత బంధం స్నేహ బంధం. తల్లిదండ్రులు జన్మను.. తోబుట్టువులను ఇస్తే.. స్నేహితులను మాత్రం మన అభిరుచులకు తగ్గట్టుగా ఎంపిక చేసుకుంటాం. చిన్నాటి నుంచి కలిసిమెలిసి ఉంటూ.. ఒకరికి ఒకరు తోడుగా ఉండేవారే స్నేహితులు. పాఠశాల.. ఇంటి పక్కన వారితోనో మాత్రమే కాకుండా కొన్నిసార్లు ప్రయాణాల్లో పరిచయమయ్యేవారు స్నేహితులుగా ఉండిపోతారు. ప్రస్తుతం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ పరిచయాలతోనూ ఫ్రెండ్‌షిప్ కొనసాగిస్తున్నారు. ఎంత వయస్సు పెరిగినా ఏరా.. ఒరేయ్ అని పిలిచే స్నేహితులు ఉంటే జీవితం ఆనందంగా ఉంటుంది అంటున్నారు.. అనేక మంది. నేడు (ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం....

## స్నేహం గురించి..

కొల్చారం(నర్సాపూర్) /రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ప్రపంచంలో అత్యంత పవిత్రమైన బంధం ఏదైనా ఉందంటే అది 'స్నేహ'బంధమే. కష్టాలొచ్చినా, నష్టాలొచ్చినా వెన్నంటి ఉండేది స్నేహితులే అంటున్నారు పలువురు వక్తలు.

### బాల్య మిత్రుడి కోసం అన్వేషణ



నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న. 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఎం.ఆనంద్ అనే మిత్రుడు ఉండేవాడు. ఇద్దరం ఉదయం నుంచి రాత్రి వరకు కలసి ఉండేవాళ్లం. తర్వాత వాళ్ల కుటుంబం చౌటుప్పల్ వెళ్లిపోయారు. మేము విడిపోయి 39 ఏళ్లు గడుస్తున్నా నా మిత్రుడి జ్ఞాపకాలు మర్చిపోలేనివి. కొంత కాలం అతని కోసం అన్వేషణ చేస్తున్నాను. వాళ్ల తండ్రి పేరు శౌరయ్య వాళ్లు మగ్గం పని చేస్తారు.
– నూకల వేణుగోపాల్ రెడ్డి,
డీఎస్పీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సంగారెడ్డి

### పార్టీలు వేరైనా ప్రాణ స్నేహితులం



నేను 30 ఏళ్ల కిందట బీజేపీలో ఉన్నప్పుడు (ప్రస్తుతం బీఆర్ఎస్) మా గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి(ప్రస్తుతం బీజేపీ)తో స్నేహం ఏర్పడింది. అప్పటి నుంచి మేము మంచి మిత్రులం. ఇప్పుడు పార్టీలు వేరైనా మా స్నేహం విడిపోని బంధం.
– వడ్డే నర్సింహ, తెల్లాపూర్

### దసరా రోజు కలుస్తాం



నేను వేముల వాడలో 1985–86లో 10వ తరగతి చదువుకున్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు 30 మంది స్నేహితులం కలిసే ఉంటా. ప్రతీ దసరా రోజు అందరం కలుసుకుంటాం. మాలో ఎవరికి కష్టం వచ్చినా అందరం ముందుంటాం.
– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్

### మేలు కోరే వారే మిత్రులు



'స్నేహం' కన్న మిన్న ఈ లోకంలో ఏది లేదు. మేలు కోరే వారే స్నేహితులు. అలాంటి స్నేహమే కలకాలం పదిలంగా ఉంటుంది. స్నేహానికి కులమతాలు, లింగభేదాలు, ఆర్థిక విషయాలతో గానీ, వైకల్యంతో కానీ ఎలాంటి సంబంధం ఉండదు. స్నేహితుల సలహాలు, సూచనలతో బాగుపడ్డ వారెందరో ఉన్నారు.
– రమేశ్ బాబు,
విశ్రాంత ఉపాధ్యాయులు, రంగంపేట

## వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి..



సాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ జెడ్పీ ఉన్నత పాఠశాల 93–94 పదవ తరగతి పూర్వ విద్యార్థులు. తమ మిత్రుల్లో ఎవరికి ఆపద వచ్చినా సాయమందిస్తూ 'తోడుగా మేమందరం' అని భరోసా ఇస్తున్నారు. 2017లో 54 మంది సభ్యులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. క్లాస్‌మేట్స్ ప్రమీల, అనీస్‌ఫాతిమా, మంగమ్మ భర్తలు అకాల మరణం చెందడంతో వారికి ఆసరాగా ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం చేశారు. వర్గల్‌కు చెందిన రామకృష్ణ, నాగిరెడ్డిపల్లి యాదగిరి కుటుంబాలకు రూ.10,000 చొప్పున, క్లాస్‌మెట్ మంగమ్మ మృతి చెందగా పిల్లలకు రూ.17,000 ఆర్థిక సాయం చేశారు. వర్గల్‌కు చెందిన చంద్రం కూతురు వివాహానికి రూ.75,000 నగదు, పుస్తెలు, మెట్టెలు, 2 క్వింటాళ్ల బియ్యం అందజేసి భరోసాగా నిలిచారు. పూర్వ విద్యార్థి మామిడ్యాలకు చెందిన ఆరె లక్ష్మణ్ కరోనా సమయంలో ప్రమాదానికి గురై మానసిక వేదన చెందగా ఇటీవల రూ.80,000 ఆర్థికసాయం చేశారు.

## విద్యార్థుల ఉత్సాహం



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తమ వెంట నిరంతరం ఉంటూ, తమ కోసం తపించే స్నేహ బంధం గొప్పదని ప్రముఖ విద్యావేత్త సత్యం అన్నారు. స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ వాణి పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ డేను నిర్వహించారు. విద్యార్థులు తమ తోటి విద్యార్థులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు ధరింపజేశారు. సత్యం మాట్లాడుతూ.. కేవలం డబ్బులు, అంతస్తులు, హోదాలతో మాత్రమే స్నేహితులకు కొలమానం కాదన్నారు. మంచితనం, ఓర్పు, ఒకరి అభివృద్ధిని కాంక్షించే వారితో స్నేహం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాజహితం కోసం పనిచేద్దాం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గజ్వేల్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు దశాబ్దాల క్రితం బీకాం చదువుకున్న విద్యార్థులంతా శుక్రవారం ఒక చోట చేరారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఓ ఫామ్‌హౌజ్‌లో కలుసుకొని తమ మధురాను బూతులను గుర్తు చేసుకున్నారు. సిద్దిపేట, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన వీరంతా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో, వృత్తుల్లో, వ్యాపారాల్లో స్థిరపడిన వారు, ఉద్యోగ విరమణ చేసినవారు వాట్సాప్ గ్రూపు ద్వారా ఒక చోట కలిశారు. తాము చదువుకున్న సమయంలో గురువులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సమాజహితం కోసం కలిసి పనిచేయాలని తీర్మానించుకున్నారు.



నగదు సాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు(ఫైల్)

## నిరుపేదలకు 'చెలిమి' చేయూత

గజ్వేల్‌రూరల్: 1994–95 విద్యాసంవత్సరంలో గజ్వేల్‌తో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా మూడు దశాబ్దాలుగా ఒకరినొకరు కలుకుంటూనే ఉన్నారు. 2021 ఆగస్టు 6న ఫ్రెండ్‌షిప్ డే రావడంతో అనాథలకు అండగా నిలవాలనే దృఢసంకల్పంతో 70మంది మిత్రులంతా కలసి చెలిమి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్‌కు అధ్యక్షుడిగా గుర్రం తులసీదాస్, ఉపాధ్యక్షుడిగా కొండాపురం యాదగిరి, జాయింట్ సెక్రటరీ మంగలిపల్లి కిరణ్‌కుమార్, కోశాధికారి దొంతుల ఆనంద్, కార్యవర్గ సభ్యులుగా గుంటుకు శ్రీను, పిట్ల ఆంజనేయులు, నాగపురి రమేశ్, టెంట్ నర్సింలు, పెద్దూరి శ్రీనివాస్, గంగిశెట్టి నర్సింలు, ఇబ్రహిం, భగవాన్, సంతోష్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కరూ ప్రతి నెల రూ.300 చొప్పున జమ చేసి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు కుకునూర్‌పల్లి, మర్కూక్, రాయపోల్, చిన్నశంకరంపేట మండలాల్లోని గ్రామాల్లో ఇప్పటి వరకు 68 సేవా కార్యక్రమాలు చేపట్టారు. మూడేళ్లుగా ప్రతి నెలా ఒక్కో సేవా కార్యక్రమానికి రూ.15వేల వరకు అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు.

## యాభై ఏళ్ల స్నేహబంధం



స్నేహితులు శ్రీమన్‌రెడ్డి, రామకిష్టయ్య, పండరిగౌడ్, సిద్దిరామ్‌రెడ్డి, అంజిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన కొలుకూరి శ్రీమన్‌రెడ్డి, ల్యాగన్నగారి రామకిష్టయ్య, కామారం గ్రామానికి చెందిన ఆర్.అంజిరెడ్డి, ఖాజాపూర్ గ్రామానికి చెందిన పండరిగౌడ్, ధరిపల్లి గ్రామానికి చెందిన సిద్ధిరామ్‌రెడ్డి. ఇందులో శ్రీమన్‌రెడ్డి, రామకిష్టయ్య క్లాస్‌మెట్స్ కాగా, మిగితా వారు సీనియర్లు. చిన్నప్పటి నుంచి అనుబంధంగా కలిసి ఉంటున్న వీరు.. 1980 నుంచి రాజకీయంగాను కలిసి ముందుకు సాగుతున్నారు. సిద్ధిరామ్‌రెడ్డి, పండరిగౌడ్ 20 ఏళ్ల పాటు తమ గ్రామాలకు సర్పంచ్‌లుగా పనిచేయడంతో పాటు పండరిగౌడ్ ఎంపీపీగా, సిద్ధిరామ్‌రెడ్డి ఏఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. రామకిష్టయ్య, శ్రీమన్‌రెడ్డిలు సర్పంచ్‌లుగా పనిచేయగా, అంజిరెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. యాభైఏళ్లుగా వీరి అనుబంధం కొనసాగుతోంది.

## ఇల్లు కట్టించారు



కనకయ్యకు ఇల్లు కట్టించిన తోటి స్నేహితులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో రెక్కాడితే డొక్కాడని కుటుంబానికి చెందిన ఎగ్గోజు కనకయ్య ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన కుల వృత్తి వడ్రంగి పనికి ఆదరణ కరువైంది. చేతి నిండా పని లేక పోషణ కష్టంగా మారింది. దీనికి తోడుగా నివాసం గృహం గాలి వానకు పూర్తిగా కూలిపోయింది. కనకయ్య దీన పరిస్థితికి 1989–90 పూర్వ విద్యార్థులు చలించి ట్రస్ట్ నుంచి రూ.60వేల విలువ గల ఇంటికి కావాల్సిన సామగ్రిని అందజేసి దగ్గరుండి ఇల్లు కట్టించి తమ సేవానిరతిని చాటారు. ఇదే బ్యాచ్‌కు చెందిన గండిపెల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మోబి నాయక్ ఆత్మహత్య చేసుకుంటే, ఆ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ బ్యాచ్‌లో ఎవరు పెండ్లి రోజు జరుపుకుంటున్న దంపతులకు గిఫ్టులు అందజేస్తారు. 6 నెలలకు ఓ సారి మిత్రులందరూ కలిసి పిక్నిక్‌కు వెళ్లి ఎంజాయ్ చేస్తారు.

### ఆడపిల్లల వివాహాలకు చేయూత



స్నేహితుడి కూతురు వివాహానికి సాయం

హుస్నాబాద్ పట్టణంలో 1983–84 పదవ తరగతి పూర్వ విద్యార్థులు 'బడి సోపతులు' పేరిట స్నేహితులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటున్నారు. బడి సోపతులు నిర్వహణ పెద్దపల్లి అదనపు కలెక్టర్ గాజుల శ్యాంలాల్ ప్రసాద్, కొత్తపల్లి అశోక్ ఆధ్వర్యంలో 2013 నుంచి తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇదే గ్రూప్‌కు చెందిన నల్లబెల్లి శ్రీకాంత్ మృతి చెందగా, ఆయన కూతురు మనోజ్ఞలకు రూ.2.60 లక్షల ఆర్థిక సహాయం. మిత్రుడు శ్రీనివాస చారి కూతురు వివాహానికి రూ.లక్ష, దయాకర్ కూతురు వివాహానికి రూ.3 లక్షలు, ఆర్‌బీ చారి కూతురు వివాహానికి రూ.1.50 లక్షల సాయం చేశారు. పూర్వ విద్యార్థి రఘుపతి భార్య రాజేశ్వరికి రూ.2లక్షలు ఇచ్చారు.

## కష్టాల్లో తోడుగా ఉంటూ..



నిత్యావసర సరుకులు ఇస్తున్న దృశ్యం (ఫైల్)

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000–2001 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్నేహం కోసం అనే నినాదంతో కలిసి చదువుకున్న పలువురు పూర్వ విద్యార్థులు వివిధ కారణాలతో మృతి చెందిన ఆకుబత్తి విఠల్ రూ.45 వేలు, బస్వారాజు సతీశ్ రూ.51వేలు, జాలిగం రాజు రూ.48 వేలు కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. అలాగే వర్షాలతో ఇళ్లు కూలిన శ్రావణపల్లి వెంకటేశ్ కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. 'స్నేహం కోసం 2000–01 బ్యాచ్' ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నట్లు తిప్పారపు అనీల్, నిమ్మన గొట్టు శ్రీనివాస్, బండ జగన్, సల్ల శ్రీనివాస్, వెల్పుల శంకర్, గాజుల రవీందర్, జాలిగం బాబు, శనిగరం రమేశ్ తిప్పారపు శ్రీనివాస్, వెల్పుల మహేశ్, మామిడాల కిరణ్ పేర్కొన్నారు.

## మేమున్నామంటూ..



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యానికి గురై ఆస్పత్రికి, మందుల ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న స్నేహితుడికి మేమున్నామంటూ క్లాస్‌మెట్స్ అండగా నిలిచి ఆర్థిక సాయం అందిస్తున్నారు. మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 1997–98బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు తమ స్నేహాన్ని చాటుకున్నారు. క్లాస్‌మెట్‌లోల కౌడిపల్లికి చెందిన పీ.శంకర్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతేడాది లివర్ సమస్యతో అనారోగ్యానికి గురయ్యాడు. విషయం స్నేహితులకు తెలియడంతో క్లాస్‌మెట్స్ స్పందించారు. అతడికి మందులు, వైద్యం ఖర్చుల కోసం 2023 ఫిబ్రవరిలో రూ.76 వేలు, 2024 జూలైలో రూ.36 వేలు ఆర్థిక సాయం అందించి కుటుంబానికి మేమున్నామని ధైర్యం చెప్పారు.


## స్నేహితులు.. ఆత్మబంధువులు



హోలి వేడుకల్లో స్నేహితులు(ఫైల్)

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర స్కూల్ 1999–2000 టెన్త్ క్లాస్ బ్యాచ్‌కి చెందిన కొంత మంది విద్యార్థుల మధ్య ఏర్పడిన స్నేహం ఆత్మీయబంధంగా మారింది. పట్టణానికి చెందిన రాఘవేందర్, భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజయ్, శ్రీధర్, సంపత్, కిషన్, విలీకర్ రెడ్డి, సికిందర్‌రాథ్‌లు 24 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. కాలం మారుతున్నా మిత్రుల మధ్య స్నేహ బంధం ఇప్పటికీ తగ్గలేదు. పట్టణంలో ఉన్న వారు నెలకు ఓ సారి కలుస్తుంటారు. ఫ్రెండ్స్‌గా ఎంజాయ్ చేయడమే కాదు తోటి మిత్రుడికి ఆపదొస్తే ఆదుకుంటారు. హోలి వేడుకల సమయంలో దోస్తులతా కలిసి ఎంజాయ్ చేస్తారు.

## వృత్తులు వేరైనా.. ప్రవృత్తి ఒక్కటే



అభిలాష్, అజయ్‌గౌడ్

పాపన్నపేట(మెదక్): వృత్తులు వేరైనా ప్రవృత్తులు ఒక్కటిగా జీవిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌కు చెందిన అంతోల్ల అభిలాష్, బద్దిగారి అజయ్‌గౌడ్. చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి చదుకున్న వారిద్దరి ఆశయాలు ఒక్కటే. సామాజిక న్యాయం కోసం తెగించి పోరాడాలనే లక్ష్యం వారిది. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేస్తూ, ప్రొఫెసర్ కోదండరాం శిష్యుడిగా రంగంలోకి దిగిన అభిలాష్ టీఆర్ఎస్వీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా స్థాయి ఉద్యమానికి ఊపిరిలూదాడు. ప్రాణస్నేహితుడు అజయ్‌గౌడ్ టీఆర్‌ఎస్వీ మెదక్ నియోజక వర్గ కార్యదర్శిగా అతనికి తోడ య్యాడు. అనంతరం అభిలాష్ సెక్యూరిటీ పోలీస్ ఆఫీసర్ ఉద్యోగం పొందగా, అజయ్‌గౌడ్ గ్రామ ఉప సర్పంచ్‌గా పని చేశాడు. యువకులకు తగిన గైడెన్స్ ఇవ్వడం, నిరుపేద విద్యార్థులకు సాయం చేయడంఅనారోగ్యంతో ఉన్నవారిని ఆస్పత్రికి తరలిస్తున్నారు.

## నడక కలిపిన స్నేహ బంధం

మార్నింగ్ వాక్‌లో మిత్రులుగా మారి | నలుగురు నుంచి 34 మంది దాకా..

సిద్దిపేటఎడ్యుకేషన్: ఒకరు ఉపాధ్యాయుడు... మరొకరు వ్యాపారవేత్త, ఇంకొకరు ప్రొఫెసర్, వేరొకరు ప్రైవేట్ ఉద్యోగి ఇలా వారంతా ఒక్కొక్కరూ ఒక్కో రంగంలో పనిచేస్తూ జీవన ప్రయాణం సాగిస్తున్నారు. సరిగ్గా 8 ఏళ్ల కిందట ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ వీరిలో నలుగురు ఉదయాన్నే వాకింగ్ ప్రారంభించారు. ఇలా ప్రారంభమైన వాకింగ్ సభ్యులు ఒక గ్రూపుగా ఏర్పడి నేడు 34 మందికి చేరుకున్నారు. ఉదయం 6 గంటలకే డిగ్రీ కళాశాల మైదానం చేరుకొని గంటపాటు నడిచి మరో అరగంట వ్యాయామం, సూర్యనమస్కారాలు చేస్తూ ఒకరికొకరు ఆప్తమిత్రులుగా మారిపోయారు. అందరూ గ్రౌండ్‌కు క్రమం తప్పకుండా రావాలని, వారంలో మూడు రోజులు డ్రెస్ కోడ్ పాటించాలని నియమం పెట్టుకున్నారు. డ్రెస్ కోడ్ పాటించకుంటే చిన్నా చితకా ఫైన్ సైతం విధించేందుకు నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకూ కేవలం గ్రూప్ సభ్యులకు మాత్రం సహాయ సహకారాలు అందించుకొని ఈ సారి సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితం కావాలని నిర్ణయించుకున్న గోల్డ్ వాకర్స్‌లో పలువురి మనోగతం వారి మాటల్లోనే...

### వెరైటీగా చేద్దాం..



ఫ్రెండ్‌షిప్‌డేను ప్రతీసారీ జాలీగా చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నాం. కానీ ఈసారి అలా కాకుండా కాస్త వెరైటీగా చేద్దాం.. ఎంజాయ్‌తోపాటు మరేదైనా కొత్తగా ఆలోచిద్దాం. మీకేమైనా ఆలోచన వస్తే సూచనలు, సలహాలు ఇవ్వండి..
–డాక్టర్ గోపాల సుదర్శనం,
అసిస్టెంట్ ప్రొఫెసర్

### ఆర్థిక సాయం చేద్దాం..



సరే మీ ఆలోచన బాగానే ఉందికాని ఏం చేద్దాం.. మన గ్రూపులో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే వాటిని తొలగించేందుకు ఏమైనా ఆర్థిక సాయం చేద్దామా.. పిల్లల ఉన్నత చదువుల కోసం గైడెన్స్ ఇచ్చేందుకు ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏమైనా ఏర్పాటు చేద్దామా..
–దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్, మెరిడీయన్ స్కూల్

### రెండు మొక్కలు నాటుదాం



అవన్నీ కూడా దీర్ఘకాలికంగా చేయాల్సిన కార్యక్రమాలు వాటిని ఇప్పటికిప్పుడే అమలు చేయడంలో కొన్ని ఇబ్బందులు ఉండే అవకాశం ఉంది. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తక్షణంగా గ్రూపు సభ్యులంతా ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి అవి పెరిగి వృక్షాలు అయేంతవరకు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకుందాం..
–మధుసూదన్‌రెడ్డి, అడ్వకేట్

### కార్యక్రమాలు చేద్దాం



మన గ్రూపు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. అనాథ పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, లేదా పేద విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించేదే కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుంది.
–నర్సింలు, వ్యాపారవేత్త

### నేడు 34 మంది వాకర్స్



మొక్కలు నాటాలనే మధు ఆలోచన బాగుంది... ఎనిమిదేళ్ల కిందట నేను వాకింగ్ ప్రారంభించినప్పుడు నాతో పాటు ముగ్గురు మాత్రమే ఉన్నారు. అనంతం ఒక్కొక్కరుగా నేడు 34 మంది వాకింగ్‌కు రావడం ఆత్మీయ మిత్రులుగా మారడం చాలా సంతోషంగా ఉంది. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మనవంతుగా ప్రతి ఒక్కరం మొక్కలు నాటి వాటిని సంరక్షించుకుందాం..
–మారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి,
టీచర్, వాకింగ్ గ్రూప్ ఫౌండర్

### సమస్యలపై స్పందిస్తూనే ..



మన గ్రూప్ సభ్యులకు ఉండే సమస్యలపై మనం ఎప్పటికప్పుడూ స్పందిస్తూనే ఉన్నాం. ఆ విషయం పక్కన పెడితే పిల్లల చదువుల కోసం గైడెన్స్ ఇవ్వడం బాగానే ఉంటుంది. కానీ ఇంకా కొత్తగా ఏదైనా చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం.
–తిరుపతిరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు,
సామాజిక సేవా

## దోస్తులంటే కేసీఆర్‌కు ప్రాణం

కలిసి తిరిగేటోళ్లం.. బావుల్లో ఈత కొట్టేటోళ్లం

కేసీఆర్ బాల్య మిత్రుడు పోలిశెట్టి లక్ష్మీనారాయణ



కేసీఆర్‌తో దుబ్బాకకు చెందిన బాల్యస్నేహితులు

దుబ్బాక : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాతో పాటే దుబ్బాక ప్రభుత్వ హైస్కూల్‌లో 4వ తరగతి నుంచి పదోతరగతి వరకు చదివిండు. దోస్తులంటే కేసీఆర్‌కు ప్రాణముండే.. పాఠశాలకు ఎగ్గొట్టి చెరువులు, బావుల వద్దకు వెళ్లి ఈత కొట్టేటోళ్లమని కేసీఆర్ బాల్య మిత్రుడు దుబ్బాకకు చెందిన పోలిశెట్టి లక్ష్మీనారాయణ చెప్పారు.

### నేను టీచర్‌ను.. కేసీఆర్ అటెండర్

కేసీఆర్‌కు చదువుకునే రోజుల నుంచే నాయకత్వ లక్షణాలుండే.. క్లాస్‌లోతన అక్క సుమతితో కలసి చింతమడక నుంచి నడుచుకుంటూ 8 కిలోమీటర్లు నడిచి వచ్చేవాడు. తర్వాత దుబ్బాకలోనే రూం తీసుకొని చదువుకుండు. కూడా మానిటర్‌గా ఉండేవాడు. పద్యాలు, పాటలు బాగా పాడేవాడు. కుండను తబల లాగా కొట్టుకుంటూ పాటలు పాడేవాడు. రామసముద్రం, పెద్ద చెరువు కట్టల మీద కూర్చుండి కబుర్లు చెప్పుకోవడం, ఆటలు ఆడుకోవడం ప్రతిరోజు మా దినచర్యగా సాగేది. సెలవుల్లో కేసీఆర్‌తో కలిసి చింతమడకతో పాటు వారి బంధువుల ఊర్లకు పోయేటోల్లం, మా ఇళ్లకు ఆయన వచ్చేటోడు. 1967–68లో పాఠశాలలో జరిగిన స్వపరిపాలనలో నేను టీచర్‌గా పనిచేస్తే.. కేసీఆర్ అటెండర్‌గా ఉన్నాడు అని గత జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నాడు.

### కేసీఆర్ దోస్తు అని హాస్పిటల్‌లో బిల్లు తక్కువ చేసింద్రు

'నాకు గత 40 రోజు క్రితమే గుండె సమస్య వస్తే హైదారబాద్‌లో హాస్పిటల్‌లో స్టంట్ వేసింద్రు. అప్పుడు నా జేబులో కేసీఆర్‌తో ఉన్న ఫొటోను చూసి డాక్టర్లు అడిగితే కేసీఆర్ నా దోస్తు అని చెప్పిన. ఆ ఫొటో చూసి బిల్లు తక్కువ తీసుకుంద్రు. కేసీఆర్‌తో పాటు మా సీనియర్ రొట్టె రాజమౌళి అన్నా గొల్ల గోపాల్, వడ్లకొండ భద్రయ్యతో పాటు కేసీఆర్ సీఎం అయ్యాక మా దోస్తులమంతా పోయి కలిసి ఫొటోలు దిగాం, ఆయనతో కలిసి భోజనాలు చేసి మా యోగ క్షేమాలు చెప్పుకున్నాం. అలాగే దుబ్బాకకు వచ్చినప్పుడు సైతం కలిస్తే బాగోగులు అడిగి తెలుసుకుండు.'అని 75 ఏళ్ల వయస్సులో ఉన్న లక్ష్మీనారాయణ తన బాల్యంలో కేసీఆర్‌తో తిరిగిన రోజులను సాక్షితో పంచుకున్నాడు.

## ఆపన్నహస్తం అందిస్తూ..



యువకుడి తల్లికి నగదు అందిస్తున్న మిత్రులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన అయిత రాము, బుక్క సతీష్, మహమ్మద్ తాహెర్, అయిత నందు, ఎస్.సంతోష్, ఎ.శివకుమార్, శివ, పీ.అఖిల్, అయిత శంకర్, అయిత లక్ష్మణ్, గుడాల శ్రావణ్‌గౌడ్, జీ.రాకేష్‌గౌడ్ అను స్నేహితులు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ అందరి మన్నల్ని పొందుతున్నారు. ఆపదలో ఉన్నట్లు తెలిసిందంటే మిత్రులంతా కలిసి ఆ వ్యక్తి వివరాలను సేకరించి సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసి విరాళాలు సేకరిస్తారు. ఇలా సేకరించిన మొత్తానికి బాధితులకు అందిస్తారు. వీరిలో ఒకడిగా తిరిగిన యువకుడు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సోషల్ మీడియా ద్వారా సుమారు 200 మంది నుంచి రూ.1,76,200 సేకరించి కుటుంబ సభ్యులకు అందించారు.

## పాఠశాలకు రూ.లక్ష విరాళం



పాఠశాలకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు అంతా ఒక్కటయ్యారు. 2016లో వీరంతా కలిసి తపస్వీ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. చదివిన పాఠశాలకు రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. సామగ్రి అందజేశారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, ఉచిత వైద్య శిబిరాలు, తోటి స్నేహితులకు కష్టకాలంలో ఆర్థిక సాయం అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.